# కాంతి రేఖలు!

ప్రీతి కలలు కంటోంది! కమ్మని కలలు! అప్పుడే ఈనిన గేదె గుమ్మ పాల జున్ను కన్న కమ్మనికలలు! వేడివేడి కలకండలోని తీపికన్న తియ్యని కలలు! పుట్టతేనెలోని రుచిని మరపించే మధురమైన కలలు!

కళ్ళు కలలతో తేలిపోతున్నాయి. గుండె ఊహలతో నిండిపోతోంది. తెల్లవారితే ఈ పల్లెగోల విరగడైపోతుంది ఈ పీడా దూశా అంతా ఒదిలి పోతుంది పిచ్చిపట్టినట్టు వొంటినిండా నూనె రాసుకుని, కుంకుడు కాయలో, సీకాయో పెట్టి, నలుగు రుద్ది ఉన్మాదుల్లా తలంటుకునే తతంగం తొలగి పోతుంది. బారెడు జుట్టుకి చిక్కుతీసుకుంటూ జడల్లుకునే జడత్వంలోంచి, ఆ మూర్ఖత్వంలోంచి, మూఢనమ్మకాలలోంచి హాయిగా నాగరిక ప్రపంచంలోకి కాలు పెట్టబోతోంది.

తను పట్టుబట్టి గోల పెట్టబట్టిగానీ, లేకపోతే తన పెళ్ళి రాకేష్‌తో జరిగేదా? ఆ భీమశంకరాన్ని కట్టుకుని, మురికి కాలవలమధ్య, పంట చేల వద్ద, ఈగలూ దోమలూ తోలుకుంటూ కూర్చునేదాన్ని ఈ పాటికి! నయం, దేముడు తనవైపు ఉన్నాడు కాబట్టి సరిపోయింది! తన గోడువిన్నాడు! తన పూజలందు కున్నాడు! తగిన వరాలిచ్చాడు! పుట్టగానే మొగుడంటూ పేరుపెట్టిన మేనరికం స్వయానా బావ అయిన భీమశంకరంతో తన పెళ్ళి తప్పిపోయేలా చేశాడు! లేకపోతే, ఉంగారాల జుట్టూ, కండరాల బిగువూ, బొంగరాల్లా పొంగివున్న బుగ్గలూ, ఈ రాకేష్ తనకి భర్తగా దొరికేవాడా? రేపీపాటికి తను ఈ రొంపిలోనుంచి బయటపడి, హైదరాబాదు చేరుకుంటుంది పెద్ద పెద్ద హోటళ్లూ, ఎన్నో సినిమాహాళ్లూ....హాయిగా తనూ రాకేష్ రోజుకొక సినిమాచూసి, రోజుకో హోటల్లో భోంచేసి, సినిమా జంటల్లా ఆనందంగా వుండొచ్చు. సినిమా ఏమిటి? ఈ మధ్యన చాలా మంది హీరోలూ హీరోయిన్లూ హైదరాబాదులో

సెటిలయ్యారని ఎదురింటి లాయరుగారమ్మాయి సుగుణకి, హైదరాబాదు నుంచి వచ్చిన వాళ్ళ చిన్నక్కయ్య కస్తూరి చెప్పిందట. సుగుణకి ఎంత గర్వమో? హైదరాబాద్ సంగతులన్నీ తనకే బాగా తెలిసినట్టు కళ్ళు తిప్పుకుంటూ చెప్తుంది, పె....ద్ద! ఇప్పుడు నేనే తనకి స్వయంగా చూసినవన్నీ చెప్తాను. రకరకాల పౌడర్లూ, స్నోలూ, షాంపూలు, అత్తరులూ, లిప్‌స్టిక్కులూ, ఓహో....ఒకటేమిటి? అన్నీ కొనేస్తాను. అవి చూసి ఎంత ఉడుక్కుంటుందో సుగుణ!' అనుకుంటూ ఊహా ప్రపంచంలో తేలిపోతూన్న ప్రీతి 'పద్మావతమ్మా....పద్మావతమ్మా....' అంటూ, లోపలినుంచి తండ్రి పిలిచిన పిలుపుతో ఈ లోకంలోకొచ్చింది. ఆ పిలుపు తనకి కర్ణకఠోరంగా అనిపించింది. "ఎన్నిసార్లు చెప్పిందో తనని అలా పిలవొద్దని! ఎవరో ముసలమ్మని పిలిచినట్టుగా అనిపించేది తనకి. తల్లయితే సరేసరి పద్మావతమ్మా అని ఒకసారీ, పద్మావతీ అని ఒకసారీ, మరీ ప్రేమ ఎక్కువైపోతే 'పద్దూ' అంటూ పిలిచేది 'పద్దూ ఏంటమ్మా ఎద్దులాగా! అసలు నాపేరు మార్చేయండి" అంటూ గోలపెట్టేది. "సాక్షాత్తూ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి ధర్మపత్ని పేరు పద్మావతమ్మా అని పెట్టుకుంటే అలా పిలుచుకుంటే తప్పా? నామోషీయా?" అనేది తల్లి.

"అర్థం చేసుకోరు" విసుక్కునేది తను.

అయితే పెళ్ళయిన తరువాత తన పేరును గురించిన అయిష్టాన్ని భర్తతో చెప్పింది. "అయితే నీకే పేరిష్టమో చెప్పు అలాగే పిలుస్తాను" అన్నాడాయన! "ప్రీతి" అంది. తనకిష్టమయిన ప్రీతి గంగూలీ మొహాన్ని తలుచుకుంటూ. అంతేకాదు, అందులోనూ తని విశిష్టత చూపిస్తున్నాననుకుంది. 'తెలుగు హీరోయిన్ల పేర్లు కాకుండా, తనకి హిందీ సినిమాలతోనూ పరిచయం వుందిసుమా' అని భర్త అనుకోవడం కోసం. అతడు నవ్వుతూ 'అలాగే!' అన్నాడు అతడు ప్రీతీ అని పిలిచినా, ఇంట్లోవాళ్ళుగాని, స్నేహితురాళ్ళుగాని, చుట్టుపక్కలవాళ్ళుగాని ఛస్తే అలా పిలవడంలేదు. అందుకే తొందరగా తనకి పట్నం - అదే హైదరాబాదు పట్నం వెళ్ళిపోవాలనుంది!

మళ్ళీ పిలిచాడు తండ్రి 'పద్మావతమ్మా' అంటూ. ఈసారి తల్లికూడా శృతి కలిపింది 'పద్దూ ఒకసారిలా రామ్మా'.... అంటూ.

"ఆ.... వొస్తున్నా అంటూ ఆలోచనలకి అంతరాయం కలిగిస్తున్నందుకు విసుక్కుంటూ వెళ్ళింది.

"నీకు ఈ చిలకపచ్చ గులాబీ అంచు చీరా, మీ ఆయనకి ఈ పాంటు గుడ్డా, షర్టుగుడ్డా కొన్నామమ్మా! బాగున్నాయా?" చూపించింది తల్లి.

"పట్నంలో పట్టుచీరలెవరు కట్టుకుంటారమ్మా. జార్జెట్టో, షిఫానో ఏదో కొనవలసింది " అంది.

కూతురి మాటలకి కాస్త చిన్నబుచ్చుకున్నా "ఏదోలే చిన్నతనం" అని సరిపెట్టుకున్నారు ఆ దంపతులు.

* * *

హైదరాబాదులో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు రాకేష్. తను భార్యామణితో సహా హైదరాబాదులో కాపురం పెట్టడానికి వస్తున్నానని చెప్పగానే అంతకుముందు ఒకే రూంలో కలసివున్న స్నేహితులంతా కలసి ఇల్లు చూసి పెట్టేరు. అదొక సింగల్ రూం ఫ్లాట్, మూడో అంతస్థులో. హైదరాబాదులో సినిమా సెట్టింగులలో లాగా పెద్ద ఇల్లూ, చక్కటి పూలతోటా, గేటు ముందు వాచ్‌మన్, ఇవన్నీ వుంటాయనుకుంది పద్మావతమ్మ అలియాస్ ప్రీతి! సామాను తీసుకుని మూడంతస్తులు ఎక్కేసరికే ఆయాసం వచ్చింది. పైగా నీళ్ళులేవు. మంచినీళ్ళు ఉదయం అయిదు ఆరు గంటల మధ్య మాత్రమే వస్తాయని చెప్పి వెళ్ళిపోయాడు వాచ్‌మెన్, ఆ పూటకి స్నేహితుల ఇంట్లో స్నానపానాదులు చేశారు. మర్నాడు అయిదింటికల్లా నిద్ర లేచింది ప్రీతి. సన్నగా దారం లాగా వొస్తూన్న పంపుకింద ఒక బిందె నిండడానికే గంట పట్టింది. ఆతరవాత కావలసిన నీళ్ళకి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. రెండు మూడు రోజులకొకసారి ఆ ఫ్లాట్‌లో వున్న వాళ్ళంతా కలిసి, నీటి సరఫరా శాఖ నుంచి, నీళ్ళ మోటరు తెప్పించుకుని, నీళ్ళు నింపుకుంటారట. ప్రీతికి ఆ నీళ్ళ మోటరు ఒచ్చిన రోజున కిందనుండి పైకి నాలుగుసార్లు తిరిగి, నాలుగు బిందెల నీళ్ళు పట్టేసరికే, కాళ్ళు నొప్పులయి పోయాయి. అడుగు వెయ్యలేక పోయింది. ప్యాకెట్టు పాలు కొనుక్కొచ్చాడు రాకేష్. ఆ రుచి అంతగా నచ్చ లేదు ప్రీతికి.

రాకేష్ ఉదయం తొమ్మిది గంటలకల్లా వెళ్ళిపోవాలి. అప్పటికి ప్రీతి వంట పూర్తిచేసేసి అతనికి భోజనం పెట్టి మధ్యాహ్నం తీసుకు వెళ్ళడానికి

ఏదైనా టిఫిను కూడా తయారుచేసి పెట్టాలి. సాయంత్రం ఏడూ ఎనిమిదీ అవుతుంది రాకేష్ ఇంటికి రావడానికి. అతను వచ్చే లోపల పనిమనిషి సరిగ్గా దొరకకపోవడం వల్ల, ఇంట్లో గిన్నెలు తోముకోవడం దగ్గరినుంచి, బజారు కెళ్ళి ఇంట్లోకి కావలసిన సరుకులన్నీ కొనుక్కు రావడం వరకూ అన్నీ తనే వొంటరిగా చేసుకోవడంతో అలసిపోతోంది ప్రీతి. ఆదివారం కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఆరోజు ఇద్దరికీ సెలవు కాబట్టి, ఇంట్లో వంట మానేసి, హాయిగా హోటల్లోనే టిఫినూ, కాఫీ భోజనం అంతా చేసి, సినిమా చూసేసి, వీలయితే ఒక సినిమా షూటింగు కూడా చూసేసి, దుకాణాలన్నీ తిరిగి తనకి కావలసిన పౌడరూ, స్నో అన్నీ కొనేసుకోవాలనుకుంది.

ఆ ప్లానంతా విని పగలబడి నవ్వేడు రాకేష్. "నువ్వు చెప్పిన ప్రోగ్రాంకి, నా జీతంలో సగం ఒక్క ఆదివారానికే అయిపోతుంది. మిగిలిన సగం ఇంటి అద్దె, బస్సు చార్జీలకి అయిపోతుంది. మరి తిండేం తింటాం మిగిలిన రోజుల్లో?" అన్నాడు.

అతని మాటలు అస్సలు నచ్చలేదు ప్రీతికి. మూతి ముడుచుకుంది. అది గ్రహించిన రాకేష్ "సరేలే అలాగే వెళదాం!" అన్నాడు, ఒకసారి వెళితే కష్టసుఖాలు ఆమే తెలుసుకుంటుందిలే అన్న ఉద్దేశంతో.

ఉదయం కాఫీ తప్ప టిఫినూ, మధ్యాహ్నం భోజనం అంతా బయటే. ఆదివారం కనక దుకాణాలేవీ లేవు. అందుకని కొనే బెడద తగ్గిపోయింది. షూటింగు పోనీ చూపిద్దాంలే అంటేఒక్క స్టూడియోలోనూ ఎవరైనా పరిచయం వున్నవారు చెబితే తప్ప లోపలికి రానివ్వడంలేదు పోనీ మరోవారం చూద్దాంలే అనుకుంటూ సినిమాకి వెళ్ళారు. ఆరోజంతా పెట్టిన ఖర్చు, రెండొందలు దాటి పోయింది, స్కూటర్లో పోసిన పెట్రోలు ఖర్చుకాక. ప్రీతిని ఇంకా నిరుత్సాహం పీడిస్తూనే వుంది. షూటింగ్ చూళ్ళేదు తను ఊహించుకున్నట్టుగా, ఇద్దరూ స్కూటరుమీద కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళొచ్చనుకుంది ప్రీతి, సినిమాలోలాగా డ్యూయెట్లు పాడకపోయినా! కానీ ఆ ట్రాఫిక్కులో ఎంతో జాగ్రత్తగా 'కిం' అనకుండా స్కూటరు నడిపితే తప్ప లాభం లేదు. అసలు వెనకాల కూర్చున్న తనకే ఎంతో భయం వేసింది. ఎప్పుడూ ఏదో బస్సో, కారో ఏదో ఒకటి అడ్డం రావడమే కాకుండా మీది మీది కొచ్చినట్టని పించేది. దాంతో అస్తమానం ఆగడం వెళ్ళడం, చాలాసేపు పట్టినట్టనిపించేది

ఎక్కడికి వెళ్లాలన్నా! అయినా ప్రీతిలోని కోరికలు మాసిపోలేదు తననుకున్న వన్నీ సాధించాలి. తన ఊరు వెళ్ళినప్పుడు, సుగుణకి తను చూసినవన్నీ చెప్పి ఉడికించాలి! ఇదే ఆలోచన. కొత్త కాపురం కలతలతో మొదలవకూడదని రాకేష్, ఆ మర్నాడు ఆఫీసునుంచి కొంచెం పెందరాడే వొచ్చి, షాపింగుకు బయలుదేరాడు. తను రేడియోలో విన్న, టి.వి లో చూసిన ప్రకటనల ప్రకారం రకరకాల పౌడర్లూ, స్నోలూ, షాంపులూ, ఇతర సౌందర్య పరికరాలూ అన్నీ ఇష్టం వొచ్చినట్టు కొనేసింది. ఒక అరడజను షిఫాను చీరలూ, ఎత్తు చెప్పులూ లిప్‌స్టిక్కూ కొనుక్కుంది. ఆ పై వారం వాళ్ళనీ వీళ్ళనీ అడిగి సెలూన్‌కి వెళ్ళి జుట్టు భుజాల వరకూ కత్తిరించేసుకుంది. అప్పటికిగానీ తను పట్న వాసంలో వున్న తృప్తీ అనుభూతీ ఆమెకి కలుగలేదు

అయితే డబ్బు సరిపోక రాకేష్ అప్పులు చేస్తున్నాడన్న సంగతి ఆమెకి తెలీదు. ఎత్తు చెప్పులతో పైకీ కిందికీ నాలుగుసార్లు తిరగడంతో ఆమెకి కాళ్ళ నొప్పి మరీ ఎక్కువైంది.

ఒక రోజున రాకేష్ సహ ఉద్యోగి సాయిరాం ఇంట్లో అతడి కొడుకు పుట్టినరోజు జరిగింది.

సాయంత్రం నుంచే షాంపూతో తల రుద్దుకుని, కొనుక్కున్న స్నో, పౌడర్లన్నీ మొహానికి పూసుకుని, పల్చటి జార్జెట్టు చీరా, పెద్ద హాండుబ్యాగు తీసుకుని వెళ్ళింది, ఆ యింటావిడ ఎలా వుంటుందో ముందుగా తెలీని ప్రీతి. ఆమెని అత్యంత అధునాతనంగా ఊహించుకుంది. ఆమెకి తెలిసిందల్లా, ఆమె పేరు నిర్మలాదేవనీ, ఆమె ఆదేదో కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నారని మాత్రమే! ఎమ్.ఎ., పిహెచ్.డి. కూడా చేసి ఎమ్ ఎ. లో బంగారు పతకాన్ని పొందేరని.అంత గొప్ప వ్యక్తి తనకన్న మంచి షోకుగా వుంటుందనుకుంది. ఆమెనిచూసి ఖంగుతింది. లేత గులాబీరంగు సన్నని అంచు వెంకటగిరి చీరా, దమ్మిడీ కాసంత బొట్టూ, బారెడు జడ వొదులుగా వేసుకుని, రబ్బరుబ్యాండు చుట్టింది. జడలో ఒకపక్కగా సగం విచ్చిన గులాబీని పిన్నుతో గుచ్చి పెట్టు కుంది. చేతినిండా గాజులూ, కాళ్ళకి కొద్దిగా పసుపు పూత! ప్రీతి ఆశ్చర్యంలో మునిగిపోయి షాక్ తిన్నదానిలా ఆమెనే చూస్తూ వుండిపోయింది. కొంత సేపటికి ఒకరూ ఒకరూ రావడం మొదలయింది. మరికొంత సేపటికి అందరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మొదలెట్టారు. అందరికీ తనే కొత్త కాబట్టి

ప్రీతి తను ఎక్కువగా మాట్లాడలేకపోయింది. వారందరూ మాట్లాడుకుంటున్న విషయాలు వింటే, మరీ ఆశ్చర్యంలో మునిగిపోయింది. ఇప్పుడు దొరుకుతున్న సరుకులలో ఎన్ని కల్తీలున్నాయో, పాలల్లో ఎన్ని నీళ్ళు కలుపుతున్నారూ, నీళ్ళల్లో ఎన్నెన్ని మందులు కలుపుతున్నారూ, ఎత్తు చెప్పులవల్ల మడిమల నొప్పులు రావడం, పసుపు రాసుకుంటే ఎంత ఆరోగ్యకరం, పల్లెల్లోని గాలి ఎంత మంచిదో వగైరా వాళ్ళ సంభాషణంతా అదే! వారి మాటల్లో తనకి అర్థమయిందేమిటంటే, ఈ పట్నంలోని జీవనం కన్న, పల్లెల్లోని జీవితం ఎంతో హాయి అయినదనీ, కలుషితం లేనిదనీ, స్వచ్ఛమయినదనీను! అందరూ తనకి వ్యతిరేకంగా ఆలోచిస్తూన్నట్టే అనిపించింది. అందులో కొందరు నిర్మలాదేవి జడను పొగడడం, చక్కటి నూలుచీరలను పొగడడం మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది పార్టీ అయిపోగానే ఏమీ మాట్లాడకుండా ఇంటికొచ్చేసింది.

కాలం గడుస్తోంది ఇంటి పనీ బయట పనితో అలసిపోతోంది ప్రీతి. అప్పులు పెరిగిపోవడంతో విసిగిపోతున్నాడు రాకేష్. దానికితోడు ప్రీతి తల్లి కాబోతోందని చెప్పింది డాక్టరు. ఆమె బలహీనంగా వుందనీ, రెస్టు కావాలనీ, మంచి పౌష్టికాహారం కావాలనీ చెప్పింది. దాంతో ఆఫీసు పనికి తోడు, ఇంటి పని కూడా అతనిమీదే పడింది. కొద్దిరోజులలోనే రాకేష్ కూడా మంచం పట్టే స్థితికొచ్చాడు పోనీ అత్తగారిని గాని, తన తల్లిని గానీ పిలుద్దామా అంటే, ఆ యింట్లో వాళ్ళుండడానికి వసతిలేదు సరికదా. పడుకోవడానికాక చిన్న మరో గది కూడా లేదు. అందుకని రాకేష్ ప్రీతిని పుట్టింట్లో దింపిరావాలనుకున్నాడు. ఆఫీసుకి వారంరోజులు సెలవు పెట్టాడు. వాళ్ళ ఊరికి బయలుదేరి వెళ్ళారు. రైలుదిగి జట్కాబండి ఎక్కగానే, ఏదో అనుభూతి! ఆ పల్లె తనని పిలుస్తున్నట్టు, ఆ పొలం తనని పలకరిస్తూన్నట్టు. పచ్చని తివాసీలు పరిచినట్టున్న పంటపొలాలు, కిలకిలమంటూ పక్షుల కిలకిలారావాలూ, పక్కనే పారుతూన్న పిల్లకాలువ మీదనుంచి వీచే సన్నని పిల్లగాలులూ, హాయిగా వింజామరలు వీస్తున్నట్టుగా అనిపించింది.

విశాలమైన ఆ ఆవరణలో పెంకుటిల్లు ఎంతో అందంగా వుంది. తండ్రి ఎదురొచ్చాడు, 'రండి అల్లుడుగారూ' అంటూ. కాళ్ళూ చేతులూ కడుక్కుని, తల్లి అందించిన పాలగ్లాసు నోట్లో పెట్టుకుంటే ప్రాణం లేచొచ్చింది. స్నానపానాదులు ముగించుకుని అలా పొలంవైపు వెళ్ళారు. ఆ ప్రశాంత వాతా

వరణం, అడుగడుగునా అందరూ 'పద్మావతమ్మా బాగున్నావా?' అని పలకరింపూ, తృప్తిగా అనిపిస్తోంది. అందరూ తనని బంధువులా పలకరిస్తున్నారు. ఆ ఫ్లాట్లలోకి ఇక్కడికీ ఎంత తేడా? ఎవరికివారు తలుపు వేసుకుని కూర్చునే వారు, ఒకరితో ఒకరికి ఏ సంబంధమూ లేనట్టు!

ఆలోచనల్లో పడిపోయింది ప్రీతి. తను ఎంత పిచ్చిగా ఆలోచించింది. తనకున్న పాడి పంటా, పచ్చదనం, గాలీ, నీరూ, వసతీ, అన్నీ....అక్కడివారు వీటికోసం ఎంత తహ తహలాడి పోతున్నారు! తనో? తనకి అన్నీవున్నా, 'దూరపు కొండలు నునుపు' అన్నట్టు పట్నవాసాన్ని గురించి పగటికలలు కంది. అయితే ఒక్కటే లోటు! పల్లెలో మంచి స్కూళ్ళు, కాలేజీలు, వైద్య సదుపాయాలూ లేవు. అవివుంటే అసలు ఎవరూ కూడా పట్నాల గురించి ఆలోచించరేమో? ఆ మాటే భర్త రాకేష్‌కి చెప్పింది. "అవును నువ్వన్నది కరెక్టు, ఇప్పటికి సరిగ్గా ఆలోచించావు" అన్నాడు.

''ఆలోచించడమే కాదండీ, ఏదో చెయ్యాలి. మీరూ" మీలాగా ఆలోచించే స్నేహితులూ కలిసి ఇక్కడి కొచ్చెయ్యండి ఒకరు బడీ, మరొకరు బజారూ, ఇలా మనమే స్థాపిద్దాం. మంచి ఆసుపత్రికోసం ప్రభుత్వానికి రాద్దాం. రాకేష్‌కి ఆ ఆలోచన ఎంతో నచ్చింది. భావి కార్యక్రమం గురించి మాట్లాడుకుంటూ ఇల్లు చేరుకున్నారు.

"ప్రీతీ!" పిలిచింది తల్లి ఎందుకో!

ఆ పిలుపు ఆమెనోట ఎలాగో అనిపించింది. ''అమ్మా! అలా పిలవకమ్మా! .... 'పద్దూ' అను" అంది. తల్లి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. పద్మావతమ్మ కళ్ళలో కాంతిరేఖలు తళుక్కున మెరిశాయి! *